# అప్పిచ్చువాడు వైద్యుడూనూ...!


## తల్లావఝుల పతంజలిశాస్త్రి

ఆదెమ్మ ఎప్పుడూ హైదరాబాదు వెళ్లలేదు. వెళ్లాలనీ అనుకోలేదు మధ్యాహ్నం వరకూ. ఇప్పుడామె గుండె రామాలయం గంటలా మోగుతోంది కన్నీళ్లొత్తి చెంగు తడిసిపోయింది.

"నే గూడా వచ్చి తీర్తాను. ఒద్దనమాక".

చిన అంజిరెడ్డి తలెత్తి ఓసారి భార్యవేపు చూశాడు. ఆమె మంచం దగ్గరికొచ్చి కూచుంది. కాళ్లు ముడుచుకుని మోచేతి మీద తల ఆనించి మంచం మీద గేసిన బొమ్మలా పడుకున్నాడు రెడ్డి.

"లం...కాడి కెళ్తన్నానా? షికారుగ్గాని ఎళ్తన్నానా?"



రెడ్డి తిడతాడనుకుంది ఆదెమ్మ. తెచ్చుకున్న విసుగు తప్ప అతని మాటల్లో కోపం లేదు. ఆదెమ్మకి ఏడుపు ఆగలేదు. అతని వేపే చూస్తూ నిశ్శబ్దంగా ఏడుస్తూ కూచుందామె. చిన అంజిరెడ్డి ఆమెవేపు చూడ్డం లేదు. కళ్లు మూసుకుని పడుకున్నాడు. హఠాత్తుగా బొల్లిరాజుగారి పనిమీద అతను హైదరాబాదు ఎందుకు వెళ్లాలో ఆమెకి అర్థం కాలేదు. రెడ్డి ఏదో దాస్తున్నాడనీ, పైకి చెప్పకపోయినా లోపల చిందరవందరై పోతున్నాడనీ ఆదెమ్మకి తెలుస్తోంది. పెరిగిపోడానికి సిద్ధంగా ఉన్న ఆమె పసుపుతాడుకీ హైదరాబాదుకీ సంబంధం ఉందని ఆదెమ్మ నమ్మకం.

"కూలిపన్లగ్గాని ఎల్తన్నానా?"

"ఛ లేదెహె"

"అయితే ఈణ్నే ఉండు. ఆ ఉప్పెదన నీకేదో నూరిపోశాడు"

అంజిరెడ్డి సమాధానంగా నిద్రపోయాడు. ఉదయం చొక్కా వేసుకుంటూంటే ఉప్పురావు వచ్చేడు. ఓ కాలు నేల మీ ఆనించి సైకిలు దిగకుండానే బెల్లు కొడుతూ అరిచాడు.

"అంజిరెడ్డీ, మాటిలారా"

ఆ మాటేవిటో అంజిరెడ్డికి తెలుసు. అతనిలాగే ఊళ్లో అనేకమంది రైతులకీ తెలుసు. ఉప్పురావు అన్నాడు.

"రాజుగా రోపాలి రమ్మన్నారు. ఇప్పుడుగాని రాగలవా?"

"ఎంటబెట్టుకు రమ్మన్నారేటీ?"

"లేదనుకో. సర్లే. ఊళ్లో కెల్తన్నావు గావాల్న. పన్జూసుకుని తొరగా రా!"

"ఆయ"

ఉప్పురావు వెళ్లిపోయాడు. చెప్పు లేసుకుని పొలంవేపు బయల్దేరేడు రెడ్డి. అతని కడుపు చెరుకు మంటలా మండుతోంది. రాజుగారు ఎందుకు రమ్మంటారు? ("ఏంటయ్యా రెడ్డి గారూ! కనిపించడం మానేశారు? మీ దయ మరి!) బొల్లిరాజుగారి దగ్గిర గింజలకోసం, ఎరువులకోసం, ఇల్లు గడవడానికీ పొలం మీద అప్పు తీసుకుని మూడేళ్లయింది. ముళ్ల కంపకి నీళ్లోసినట్టయింది. ఒక్క పైస తీరలేదు. పొలాలన్నీ బీళ్లు పడ్డాయి. ఈ మూడేళ్లలో కనీసం పది చిన్న తరహా తుఫాన్లు వచ్చి వెళ్లేయి. మెట్టలో ఒక్క చినుకు పడలేదు. చెరువు ఎండేపోయింది. దానికి పూడిక తీసి పదేళ్లయింది. బొల్లిరాజుగారి వడ్డీ వ్యాపారం దృష్టిలో ఉంచుకుని, దున్నల గుంపుల్లా ఊరిమీద మబ్బులు కమ్మడంతప్ప వర్షం మాత్రం పడ్డంలేదు. మబ్బుల్ని వెలిగిస్తూ మెరుపులు మెరవడం చూసి కొండల వెనక మంచి పెద్ద గాలి దుమారం ఊరి మీద కొచ్చి మబ్బుల్ని తరిమేశాయి. ఆచార్లు గారు ఓ రోజల్లా ఉపవాసం ఉండి రామాలయంలో పూజలు జరిపించేరు. బాగా జరిగేయి పూజలు. కొన్ని డజన్ల కోళ్లనీ, అరడజను మేకల్నీ చాలా శతాబ్దాలుగా గ్రామాన్ని కాపాడుతూ వచ్చిన అమ్మవారికి బలి ఇచ్చేరు. ఆమెకి ఆకలి తీరిందేమో గానీ తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకలేదు. కోళ్లు తిన్నమ్మ రాయి అయిపోయింది. చిన అంజిరెడ్డి పొలం తొండలు తిరగడానికి కూడా పనికిరాకుండా పోయింది. నిజానికి ఊరంతా కాలి చల్లారినట్టే ఉంది. గాలీ, ధూళీ మినహా జీవం అంతరించిపోతున్న ఏదో సుదూర గ్రహంలా తయారయింది గ్రామం. బంధువుల రాకపోకలు ఎప్పుడో ఆగిపోయేయి. పెళ్లిళ్లు-పేరంటాలూ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఊళ్లో చెరువు కవతలి స్మశానం మాత్రం నిత్య నైవేద్యంతో వేడిగా ఉంటోంది. కూతురు పెళ్లి ఏడాది తిరగ్గానే తాకట్టు పెట్టిన పొలం విడిపించుకోలేక సీతయ్య కాపు ఓరోజు ఊరి అమ్మవారికీ, రామాలయానికీ వెళ్లి కళ్లనీళ్లు పెట్టు కుంటూ ఇద్దర్నీ కొంచెం పెద్దమనసు చేసుకుని వర్షంపడే ఏర్పాట్లు చెయ్యమని దణ్ణం పెట్టుకున్నాడు. మర్నాడు సాయంత్రం పొలానికి వెళ్లి పురుగుమందు తాగేడు. గంట తరవాత ఇంటికొచ్చే మేకల్లాగ మబ్బులు ఊరివేపు తిరిగేయి. మర్నాడుదయం సీతయ్య శవం బాగా రాజుకునే వరకూ ఉండి ఊరు ఖాళీ చేసి అడవివేపు వెళ్లిపోయాయి మబ్బులు. మనిషి మాంసం మరిగిన కరువు మొసలి అప్పట్నించీ ఎంచుకుని మింగడం ప్రారంభించింది. జంగం మల్లికార్జునుడు, సత్తిరెడ్డి, వడ్రంగి భద్రం పెళ్లాం మొత్తం ఏడుగురు చినుకుకోసం చూసి లాభం లేదని పురుగు మందుతో దాహం తీర్చుకున్నారు.

అంజిరెడ్డి కాళ్లు అలవాటుగా పొలం వెళ్తున్నాయి. భుజం రాసుకునేవరకూ చూడనే లేదతను. భద్రం ఆగిపోయాడు.

"పొద్దెక్కి పొలం బయల్దేరేవేటీ?"

"లేదు మావా! నువ్వేణ్నించి?"

"ఆ పనే వుంది? ఇంట్లో కూచోలేక గుడికాడ కూచునొస్తన్నా. చేసుకోడానికి పన్లేడున్నాయి? పొలాలు బోయినయి. పశువులు బోయినయి. నే దాగాల్సిన మందు అది తాగింది".

"మావా మనూరి కేదో శని బట్టింది. ఏం జెప్పేది? నా కొడుకులిద్దర్నీ కూడు పెట్టలేక తుని పంపించా!" అంటూ నవ్వి మళ్లీ అన్నాడతను.

"తెల్లారి బొల్లిరాజుగారు కేకేశారు. పురుగు మందు గాని ఇస్తారేమో అడగాలి".


"నవ్వుతాలకి కూడా అనకురా బాబూ! మన మండలానికి బోరు పంపులు సాంక్షనిచ్చారంటగా?"

"ఊరుకో మావా! గంగేడుంది? భూమిలో నీటి చుక్కుందా? ఎదవ బోరు పంపులు ఎవడిగ్గావాలి? పాతాళం నించి నీళ్లు లాగేసినోళ్లు బాగనే ఉన్నారు. ఆళ్లకేం? ఈ కార్తె ఎలగా కొంప ముంచింది. ఇంక ఎవుళ్లచ్చ వాళ్లు దాగాల్సిందే. దీని యమ్మ. ఆ బోరు పంపులేసే లం... డుకుని

కథ

నాల్రోజు లిక్కడుండమనెహె!"

భద్రం కాసేపు ఏవీ మాటాడలేదు. చెయి జాపి అగ్గిపెట్టె తీసు కుని బీడీ వెలిగించుకుని వెళ్లిపో యాడు. నాలుగేళ్లక్రితం పడ్డ జల్లులా అం జిరెడ్డి పచ్చిబూతులు తిట్టుకుంటూ పొ లంవేపు వెళ్లిపోయాడు. కొంచెం దూరంగా నీడలా పొలాల మీంచి అడ్డదారిన హైరోడ్డు దగ్గిర్నిం చి పుల్లల మోపులు నెత్తికె త్తుకుని ముగ్గురు మనుషులుకో మిటి సుబ్రమణ్యం దొడ్డివేపు పరుగులా నడుస్తున్నా రు. రా త్రిళ్లు తార్రోడ్డు పక్కనున్న చె ట్లకి నిప్పుపెట్టి మెల్లిగా లోప ల్నించి చెట్టు చచ్చేవరకూ ఓపిక చేసుకుని పుల్లల్ని ఇంటికి జేరేసుకోవడం, కొన్ని సుబ్రమ ణ్యానికి అమ్ముకోడం కరువు నేర్పిన విద్య. రోడ్డు మీది చెట్లు నిరుటి పచ్చతోరణంలా ఉన్నాయి.



తరువాత చాలాసేపటికి అంజిరెడ్డి ఒంట్లో నెగడు తగ్గింది. క్రమంగా అ తనిలో నిస్సహాయత పురిగొల్పే ని ర్లిప్తత శాంతపరిచింది. ఈసారి కాళ్లని తనీడ్చుకుంటూ రాజుగారింటివేపు బయలుదేరేడు.

గుమ్మం దగ్గిరకొస్తూండగానే చేతిలో రెండు కూల్‌డ్రింకు సీసాల్తో ఉప్పు రావు కనిపించేడు.

"ఒచ్చేవేటీ! ఒక్క నిమిషం"

ఇద్దరూ లోపలికి దారి తీశారు. బయట బల్లదగ్గిర నుంచుండిపోయాడు అంజిరెడ్డి. లోపల్నించి ఉప్పురావు గ్లాసెడు చల్లటి నీళ్ల తీసుకొచ్చి ఇచ్చే డు. చల్లటి సీమవెండి గ్లాసు చేతిలో ఉంచుకునే లోటాడు. ఆశ్చర్యపోయా డు రెడ్డి.

"తాగవయ్యా, రాజుగారిమ్మన్నారు."

బెంచీమీద కూచుంటూ రెడ్డిని గూడా పక్కన కూచోపెట్టుకున్నాడు ఉప్పు రావు. మూతి తుడుచుకుని గ్లాసు కింద పెడుతూండగా అన్నాడు అతను.

"ఏవుందీ! నీ గురించి మాటాడదావనే రాజుగారు రమ్మన్నారు. మరి మూడేళ్లు దాటిపోయింది గదా! ఇంకివాళ సెటిల్మెంటు జేద్దామని కేకేశార న్నమాట".

"సెటిల్మెంటా?" చిన అంజిరెడ్డి కడుపు ఒణికింది. అంటే పొలం వదిలేసుకోవడమే. ఉప్పురావు కరువు గురించీ, దారిద్ర్యం గు రించీ, వీటికి సంబంధించిన అప్పుల గు రించీ, వీటిని మించిన రాజుగారి ఔదా ర్యం గురించీ, మాట్లాడ్డం మొదలుపెట్టేడు. అంజిరెడ్డి మీద రాజుగారికున్న ప్రత్యేక గౌ రవం గురించి అవుతుండగా పనిమనిషి లోపల్నుంచి ఒచ్చింది.

పరిమళిస్తూ పచ్చగా విస్తరాకులో నూనెతో మెరుస్తోన్న పులిహోర చూడగానే అంజిరెడ్డి కడుపులో ఉన్న ఆకలంతా వెయ్యి నోళ్లతో విచ్చుకుంది. రాజుగారు చేద్దావనుకున్న సెటిల్మెంటు పులిహోర కింద ఉండిపోయింది. ఏడు నిముషాల తరువాత అంటు జాడ దొరకని విస్తరాకుని జాగ్రత్తగా మడిచి గోడవతల పడేసి చెంబెడు మంచినీళ్లు తాగి పెద్దగా త్రేన్చకుండా ఉండేందుకు విఫల ప్రయత్నం చేశాడు అంజిరెడ్డి.

"చినపాపగారు కేకేత్తన్నారండి".

ఉప్పురావు చటుక్కున లోపలికి వెళ్లేడు. మూడు నిముషాల్లో తిరిగొచ్చేడతను. విస్తరాకులో పులిహోర తీసుకొచ్చి అంజిరెడ్డి కిస్తూ అన్నాడు–

"కొద్దిగా. చినపాపగారొచ్చేరు గదా. సర్దాగా ఇందాకా ఆవెట్టి పులి హోర జేసేరు. ఉండు. నీళ్లట్టుకొస్తా".

పరిమళిస్తూ పచ్చగా విస్తరాకులో నూనెతో మెరుస్తోన్న పులిహోర చూడగానే అంజిరెడ్డి కడుపులో ఉన్న ఆకలంతా వెయ్యి నోళ్లతో విచ్చు కుంది. రాజుగారు చేద్దావనుకున్న సెటిల్మెంటు పులిహోర కింద ఉండిపో యింది. ఏడు నిముషాల తరువాత అంటు జాడ దొరకని విస్తరాకుని జాగ్రత్తగా మడిచి గోడవతల పడేసి చెంబెడు మంచినీళ్లు తాగి పెద్దగా త్రేన్చ కుండా ఉండేందుకు విఫల ప్రయత్నంచేశాడు అంజిరెడ్డి.

"లోపల రాజమండ్రి డాక్టరుగారున్నారు. పిలుస్తారు".

కాసేపట్లో కబురొచ్చింది. తువాల్తో ముఖం తుడుచుకుని లోపలికి అడుగు పెట్టేడు రెడ్డి. రాజుగారికీ, డాక్టరుగారికీ దణ్ణం పెట్టి గోడనానుకు ని కూచున్నాడతను. రాజుగారతనివేపు నిశితంగా చూడగానే ఆవపెట్టిన పులిహోర అడుగునించి కెలవరటం లేచిపడింది. రాజమండ్రి డాక్టరుగారి వేపు చూశాడు. తెల్లటిబట్టల్లో తెల్లగా ఉన్నారాయన. చల్లటి అరటిదూట గుర్తొచ్చింది రెడ్డికి. పక్కనే ఉన్న దస్తావేజులు చేతిలోకి తీసు కుని అంజిరెడ్డిని చూస్తూ రాజుగార న్నారు.

"ఇవాళింక ఏదో మాటనుకుంటే బావుంటుంది. నీ ఇష్టం మరి".

ఇంక మీరే సెటిల్మెంటు చె య్యాలండి" అన్నాడు ఉప్పురావు. ముందు రా జుగారు పెదవి విరిచేరు. త లూపుతూ క్షణం ఆగి అ న్నారు.

"ఈయన మన క్రిష్ణంరాజు గారనీ నీకు తెలీదనుకో. మన జిల్లాలో ఏటీ స్టేట్‌లో ఏటీ గొప్ప డా క్టరుగారాయన. మనింట్లో అందరం ఎప్పుడూ ఆయన దగ్గిరికే ఎల్తా ఉం టాం. ఆయనగారు చేసిన ఆపరేషన్లు చూసి హైదరాబాదులో డాక్టర్లకే మతోయింది. దేవుడనుకో. ఆయన హస్తవాసి ఎటువంటిదో నీకు తెలీ దు. ఉదయం లెగ్గానే దణ్ణం పెట్టుకోవాల్సిన మనిషిరా బాబూ రా జుగారు!

డాక్టరుగారి హస్తవాసికీ పొలం మీదున్న తన అప్పుకీ సంబంధం తెలీ లేదు అంజిరెడ్డికి. ఆ విషయం స్పష్టంగా తెలిసి బొల్లిరాజుగారన్నారు. ఆయన అరగంట మాట్లాడేరు. ప్రతి అయిదారు వాక్యాలకీ సహకార వాక్యాలు పలుకుతూ అంజిరెడ్డి భుజం తట్టేడు ఉప్పురావు. అంజిరెడ్డి లోపలా అతని చుట్టూరా కరువు పరుచుకుంది.

"నేనెంతో ఆలోచించి చెప్పేను. వేరే పరిష్కారం లేదు. పొలం పోతే పోద్దనుకుంటే తప్పు" అన్నారు బొల్లిరాజు గారు.

"బలేటోరే. తండ్రిలాగ మీరు చెప్పింతరవాత ఊఁ అనకేవంటాడు?" అన్నాడు ఉప్పురావు.

"మీరు చెప్పండి రాజుగారు" డాక్టరువేపు చూసి అని రాజుగారు దస్తావే జులు చూడ్డం మొదలు పెట్టేరు. అంజిరెడ్డి ని దగ్గిరికి పిలిచి పెన్సిలూ, పుస్తకం తీసి తెల్లగా మెల్లగా మొదలుపెట్టారు కృష్ణంరా జుగారు. బొమ్మలు గీసి చూపించేరాయన. ఎవరేనా అంత బాగా మాట్లాడగలరని అం జిరెడ్డికి తెలీదు. నిన్ను రేపుదయం ఏడో గంటకల్లా ఉరితీస్తాం లేదా ఉప్పు పా తరేస్తాం. ఎంత బావుంటుందో. నీకు మరీ బావుంటుంది" అన్నా చెవులకి సు ఖంగానే ఉంటుందనుకున్నాడు. మనిషి అస్థిపంజరం గీసి చూపిం చారు డాక్టరుగారు. అంజిరెడ్డి నోరు తెరుచుకుని వింటూ ఉండిపోయాడు. అంతా అయి పోయింతరవాత నీరస సంగా గోడకి చేరబడ్డాడు. బొల్లిరాజుగారు చేతిలో కాయితం చూస్తూ రెడ్డి అప్పు వడ్డీతో సహా ఎంత యిందో వివరించారు. ఉప్పురావు అన్నాడు.

"ఏవీ లేదు. నే జెప్పినట్టు చెయ్యి. అణా పైసల్తో సహా నీ అప్పు తీరిపోద్ది. రాజుగారి మాటిను".

మళ్లీ కృష్ణంరాజుగారు మాట్లాడేరు. "మీ ఇష్టం అనుకోండి" అన్నారు చివరిగా. సగానికి సగం పొలం పోగొట్టుకుని చేసేదేవుంది? దేవుడి లాం టి డాక్టరుగారున్నారు. బొల్లిరాజుగారు అంజిరెడ్డి వేపే చూస్తున్నారు.

తిరిగేయి. తువాల్తో తుడుచుకుంటూండగా కృష్ణంరాజుగారు ఆప్యాయంగా అతని భుజం చుట్టూరా చెయ్యివేసి అనునయంగా ధైర్యం చెప్పేరు. చల్లటి కుండ నీటితో స్నానం చేసినట్టుంది రెడ్డికి. గడపవరకూ మాట్లాడుతూ తీసికెళ్లేరాయన. రోడ్డుమీద అంజిరెడ్డి ఉప్పురావు ఇద్దరే మిగిలేరు. ఉప్పురావు గొంతు తగ్గించి అన్నాడు.

"ఎక్కడా ఒక్కమాట పొక్కనీకు మరి. ఇంటాడదానికి చెప్పేవో ఇంకంతే. ఆడదానికేం దెలుస్తుంది? అర్థమైందా? ఇంకోటి... రైతన్నావోడికి పొలం బోయింతరవాత బతుకేవుంది? ఆలోచించు. ఇందులో నీకే బాదా లేదు. లాబం ఉందంతే".

తల ఊపేడు అంజిరెడ్డి. మళ్లీ రామాలయం వేపు వెళ్లేడు. మధ్యాహ్నానికి ఇంటికి తిరిగొస్తూనే మంచం మీద పడకేశాడు.

"అన్నం దినవా? ఇప్పుడు పడకేటీ ఎప్పుడూ లేంది?"

"ఒద్దుగానీ నాల్రోజుల్లో హైదరాబాదు బోవాలి. బొల్లి రాజుగారు కేకేసి పన్జెప్పేరులే. మనకి లాబం ఉంటదనుకో. ఊరంతా టముగ్గాని ఏసేవు గనక. ఎవరికీ తేలీడానికిల్లేదు. ఎల్లి నువ్వు దిను".

తరవాత రెండు రోజులు ఆదెమ్మ అనేక ఆత్మహత్యా ప్రయత్నాలు చెప్పిందతనికి. కిరసనాయిలు పోసుకోడం, నీళ్లున్నా లేకపోయినా బావిలో దూకడం, పురుగుమందు తాగడం లాంటి ప్రత్యామ్నాయాలు చెప్పిందామె.

"నోరు ముయ్యిహె" అన్నాడు అంజిరెడ్డి. మూడో రోజు నుంచీ ఆదెమ్మ ఏడవడం మానేసింది. కడుపులో బెంగ పెరుగుతోంది. కచ్చితంగా వారం రోజుల్లో వచ్చేస్తానని, కూలి పన్లకి కాదనీ, దేవుడి మీదా అమ్మవారిమీదా, పుస్తెలమీదా ప్రమాణం చేశాడు రెడ్డి.

ఉప్పురావు రోజుకి ఒకసారేనా అనుకోకుండా అంజిరెడ్డిని బయట కలుస్తూనే ఉన్నాడు. బీడీలు అతనే కొంటున్నాడు. టీలు అతనివే. పొలంలోకి ఇద్దరూ వెళ్తున్నారు. నాలుగు రోజులు దాటినా మళ్లీ రాజుగారు కబురు పెట్టలేదు. ఓ రోజు సాయంకాలం రామాలయం అరుగుమీద కుర్రాళ్లు పులీ మేకా ఆడుతుంటే చూస్తూ నుంచున్నాడు చిన అంజిరెడ్డి. వెనక నుంచి భుజం తట్టేడు ఉప్పురావు.

"ఓపారిలి రా, కేకేశారు"

రాజుగారింటికి తోలుకెళ్లేడు ఉప్పురావు. లేత నీలంరంగు చొక్కాలో తెల్లగా, ఆరోగ్యంగా, కృష్ణంరాజుగారు అదే వరసలో నవ్వుతూ రెడ్డిని పలకరించి అతని భుజం మీద చెయ్యివేసి అన్నారు.

"రెడ్డిగారూ! ఎలా ఉన్నారు?"

గ్లాసునిండా తియ్యటి టీ పట్టుకొచ్చి ఇచ్చేడు ఉప్పురావు.

"డాక్టరుగారు రెయిల్లో రిజర్వు చేయించారు. ఎల్లుండి ప్రయాణం. మధ్యాహ్నం బస్సుకి నువ్వూ, ఉప్పురావూ బయల్దేరండి. డాక్ట్రుగారింట్లో రాత్రి రెండు మెతుకులు తిని రైలెక్కుదురు గాని. ఆడుంటాళ్లే నీతో" అన్నారు బొల్లిరాజుగారు.

"ఎల్లుండంటారా?" వేళ్లమీద లెక్కవేసి అన్నాడు ఉప్పురావు. "బ్రహ్మాండమైన మూర్తం మంచి రోజు పడింది" తరవాత గంటసేపు కృష్ణంరాజుగారే మాట్లాడేరు. అంజిరెడ్డీ, ఉప్పురావూ బయటి కొచ్చింతరవాత జేబులో రెండొందలు పెడుతూ అన్నాడు ఉప్పురావు.

"నీగ్గాదు. ఇంటో ఇచ్చి బయల్దేరు. కర్చులికి రాజుగారిచ్చేరని చెప్పు. ఊఁ అయిపోయింది. నీ దరిద్రం తీరిపోయిందనుకో".

ఇద్దరూ బీడీలు వెలిగించుకుని మరికాసేపు మాట్లాడుకుని వెళ్లిపోయారు. ఆ రాత్రి ఆదెమ్మకేవీ చెప్పలేదు. నాలుగు లుంగీలు, రెండు చొక్కాలు, రెండు బనీన్లు, తువాలు సంచిలో పెట్టుకుని ఆ మర్నాడు ఆదెమ్మని పిలిచి చెప్పేడు. ఆమెకి ఏడుపు ఆగలేదు. మళ్లీ అన్ని ప్రమాణాలు చేయించుకుందామె.

"నువ్వబద్ధం చెప్తే నువ్వొచ్చేసరికి ఉండను"

"పని మీదబడి ఎల్తన్నాను. అబద్ధం ఎందుకు? పిచ్చి కుక్కగాని కరిచిందా?"

ఆదెమ్మ నీళ్లు నిండిన కళ్లలోకి చూడలేక చటుక్కున ఆమెని దగ్గిరికి తీసుకున్నాడు. అతుక్కుపోయిందామె.

"ఊరుకోమరి. ఒచ్చింతరవాత చెప్తా" అంజిరెడ్డి కళ్లు చెమర్చేయి. ఆదెమ్మకి ప్రాణం హాయినిపించింది. ఒళ్లు కొంచెం ఏదోలా ఉంది. ఇద్దరి మధ్యా కరువొచ్చిపడి చాలా కాలమైంది.

మర్నాడు మధ్యాహ్నం బస్సు ఒదిలిన ధూళిలో కళ్లు ఒత్తుకుంటూ నుంచుండిపోయింది ఆదెమ్మ. బస్సు గంటన్నరలో రాజమండ్రీ చేరింది.



ఎండగానే ఉంది. బస్ కాంప్లెక్సులో చల్లటి కూల్డ్రింకు ఇప్పించాడు ఉప్పురావు. చినఅంజిరెడ్డి ప్రాణం కుదుట బడింది. బస్సెక్కిందగ్గర్నించీ కడుపులో గుబులు గందరగోళం చేసింది. కష్టపడి ఆదెమ్మ వేపు చూసి నవ్వేడతను. గంటన్నర ఉప్పురావు మాట్లాడుతూనే ఉన్నాడు. బయటకొచ్చి ఇద్దరూ ఆటో ఎక్కేరు. ఆస్పత్రికి వెళ్లిన అరగంట తరవాత కృష్ణంరాజుగారొచ్చేరు. మళ్లీ చల్లటి అరటి దూటలా తెల్లటి బట్టల్లో ఉన్నారాయన. "ఇవాళ పేషెంట్లు ఎక్కువమంది ఉండిపోయారు. రండి రెడ్డిగారూ! ఇద్దర్నీ మేడమీదికి తీసికెళ్లి గది తాళం తీశారు డాక్టరుగారు. పరిశుభ్రంగా ఉంది గది. లైటూ, ఫేనూ వేసి "టీ పట్రమ్మని చెప్పు" అన్నారాయన. మంచంమీద కూచున్నాడు అంజిరెడ్డి. అయిదు నిముషాల్లో నర్సూ, ఉప్పురావు టీతో వచ్చేలోగా రెడ్డి ఒళ్లు జలదరించింది. గదంతా చల్లబడిపోయింది. డాక్టరుగారు వెళ్లిపోయింతరవాత నిద్రపోయి వర్షాలకి ఊరి చెరువు గండిపడ్డట్టు కలగన్నాడు. ఆరుగంటలకి లేచేడు రెడ్డి. నర్సు మళ్లీ టీ తెచ్చి ఇచ్చింది. ఇంతలో ఉప్పురావు స్నానాల గదిలోంచి వచ్చేడు.

"చలేస్తోందిరా బాబూ! ఏం జేసినా ఈ గదిలోనే జేసుకోవాలనుకో"

"ఇంకేం! మీ ఆవిణ్ని దీసుకురా"

"ఏసీ గదిలోకి గూడా పెళ్లాలేట్రా బాబూ"

అరంజిరెడ్డి కూడా స్నానం చేసి రాగానే ఇద్దరూ కిందికి వెళ్లేరు. హాల్లో కిటకిటలాడుతున్నారు జనం. రాజుగారు చెప్పింది నిజమేననుకున్నాడు రెడ్డి. ఏటనుకున్నావ్ అన్నట్టు చూశాడు ఉప్పురావు. ఏడున్నర దాటుతూండగా రెండు కంచాల్లో కమ్మటి కోడి పలావు వచ్చింది. భోజనం అయేవరకూ ఇద్దరూ మాట్లాడలేదు. డాక్టరుగారి కారులో ఆయనా, ఆటోలో వాళ్లిద్దరూ స్టేషనుకి వెళ్లగానే ఆయన గబగబ ముందు లోపలికి వెళ్లిపోయారు.

హైదరాబాదులో ఆస్పత్రి లిఫ్టుదిగ్గానే ఆశ్చర్యపోయాడు అంజిరెడ్డి. నేలా, గోడలూ తెల్లగా తళతళ మెరుస్తున్నాయి. నీలం రంగు బట్టల్లో అందంగా లేని నర్సు కంటబడలేదు రెడ్డి. డాక్టరుగారు రెండో అంతస్తులో ఆగిపోయారు. ఆ రాత్రి మళ్లీ ఏసీ గదిలో హాయిగానే నిద్రపోయాడు రెడ్డి. మళ్లీ కలలో విపరీతమైన వర్షాలు. అందరూ వర్షంలో తడుస్తూనే రామాలయానికి వెళ్లేరు.

మూడోరోజు మధ్యాహ్నం కళ్లు తెరిచేడు అంజిరెడ్డి. డాక్టరుగారూ! ఉప్పురావు ఏదో అడుగుతున్నారు. కాసేపాగి భుజం తట్టి డాక్టరుగారు బయటికి వెళ్లిపోయారు.

"ఏటైంది?"

"నీకు చెప్పిందే! నీ అప్పు వడ్డీతో సహా తీరిపోయింది. దస్తావేజులు నా దగ్గిరే ఉన్నాయి. కావాలంటే ఇప్పుడే ఇచ్చేగల్ను. ఊఁ. నీకేం బాద లేదుగా"

"అప్పు తీరటం నిజవేనా?"

"నీ కాయితాలు నీకిస్తాన్లే. చూసుకుందూ గాని. ఎలగుందేటీ?"

"బాగనే ఉంది. ఈ కట్టు తీసేస్తారా?"

"కుట్లు తీగానే తీసెస్తారు. నెప్పి దప్పీ ఉండదు. మామూలుగానే పన్లు నువు చేసుకోవచ్చు. ఈ ఏడాది నువ్వు మూడోవాడివి".

"అది..... తీశారంటావా?"

"ఆహో! డాక్ట్రుగారు చూపించారు. ఎర్రగా మన పెద్ద జీడిపిక్కలాగుంటది. కానీ రెడ్డీ! దేవుడున్నాడయ్యా! ఆడు పిచ్చి నాకొడుకనుకునేవోణ్ని. పాపంరా బాబూ. ఇప్పుడు జూడు. దేవుడు మనకి కొన్ని రెండెట్టేడు. కొన్ని ఒకటే పెట్టేడు. నీకుంకోటుంది. ఆఁ. అయినా అంజిరెడ్డీ ఉచ్చోసుకోడానికి ఓటి చాల్దేటీ?"

•